ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
04-09-2024
బుధవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 05 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి




## సహాయక చర్యల్లో అలసత్వం వహిస్తే

# కఠిన చర్యలు

### బాధితులను ఆదుకునేందుకు సర్వ శక్తులూ ఒడ్డుతున్నాం
### ప్రజలకు నష్టం జరిగితే సహించేది లేదు
### మీడియా సమావేశంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ

2 లో

**జయభేరి, విజయవాడ:**

క్షేత్ర స్థాయిలో పర్యటించి బాధితులకు ఆహారం అందజేస్తున్నాం. విపరీతంగా వచ్చిన వరదతో మూడు రోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వారిని ఇబ్బందుల నుండి బయటకు తెచ్చేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నా. 6 హెలికాప్టర్లు, 30 డ్రోన్లు తెప్పించి బాధితులకు ఆహారం అందజేస్తున్నాం. 179 సచివాలయవాల పరిధిలో...ఒక్కో సచివాలయానికి ఒక సీనియర్ అధికారిని నియమించాం. బాధితుల వద్దకు ట్రాక్టర్లు, వ్యాన్లు, ప్రొక్లెయిన్లు, బోట్లు...ఎలా వెళ్లడానికి సాధ్యమైతే ఆ విధంగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేశాం. 32 మంది ఐఏఎస్ అధికారులు విధుల్లో ఉన్నారు. 10 జిల్లాల నుండి బాధితుల కోసం ఆహారం తెప్పిస్తున్నాం. మూడు పూటలా బాధితులకు ఆహారం అందిస్తున్నాం. చివరి వ్యక్తి వరకూ సాయం అందిస్తాం. నా సర్వశక్తులొడ్డైనా బాధితులను ఆదుకుంటా. రెండు రోజులు ఇబ్బంది పడ్డారు...ఇక ఇబ్బంది పడటానికి అవకాశం ఉండకూడదు. ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాను...వాటిని పాటించకపోతే కఠిన చర్యలకు తీసుకోవడానికి వెనకాడను. ఆహార సరఫరా సమయంలో బాధితులు ఎక్కువగా గుమికూడకుండా ఉంటే మీరుండే ప్రాంతానికే తీసుకొచ్చి అందిస్తాం. ఒక్కో బోటులో నలుగురు సిబ్బంది, ఒక ఆక్టోపస్, ఒక గ్రేహౌండ్ ఉంటారు. సరిగా పనిచేయని పోలీసులను కూడా హెచ్చరిస్తున్నా... ...మిగతాది 2 లో

# ప్రభుత్వం అప్రమత్తం వల్లే పెద్ద నష్టం తప్పింది



- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా రూ. 5430 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది
- విపత్తుకు కారణమైన మున్నేరు రిటైనింగ్ వాల్ పై త్వరలో నిర్ణయం
- కెసిఆర్ కుటుంబం వద్ద లక్ష కోట్ల రూపాయలున్నాయి.. ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 2000 కోట్లు ఇవ్వొచ్చు గా..
- హరీశ్ రావు ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు భజన చేస్తున్నాడు
- హరీశ్ రావు వస్తే నిజ నిర్ధారణ కమిటీ వేస్తా
- ఈటెల రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం మాని కేంద్ర నుంచి నిధులను తెప్పించు
- వరద నీటిలో కొట్టుకుపోయిన యువ శాస్త్రవేత్త కుటుంబాన్ని పరామర్శించిన సిఎం

**జయభేరి, మహబూబాబాద్, సెప్టెంబర్ 3:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరద బాధితులను పరామర్శించేందుకు సోమవారం రోడ్డు మార్గంలో ఖమ్మం వెళ్లారు. మంగళవారం ఉదయం మహబూబాబాద్ జిల్లాలో వరద నీటిలో కొట్టుకుపోయిన యువ శాస్త్రవేత్త కుటుంబాన్ని పరామర్శించారు. ఆ తర్వాత ముంపు ప్రాంతాల్లో పర్యటించి మాట్లాడుతూ ప్రభుత్వం అప్రమత్తం వల్లే పెద్ద నష్టం తప్పిందని అన్నారు. కృష్ణ, ఖమ్మం జిల్లాలు పక్కపక్కనే కవల పిల్లలాగే ఉంటాయని వివరించారు.కృష్ణా జిల్లాలో కంటే ఖమ్మం జిల్లాలోనే రికార్డు స్థాయిలో 42 సెమీ. వర్షపాతం నమోదయందన్నారు. అందుకే విపరీత నష్టం వాటిల్లిందన్నారు. విపత్తుకు కారణమైన మున్నేరు రిటైనింగ్ వాల్ పై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. త్వరలో ఇంజినీర్లతో చర్చిస్తామన్నారు.భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ప్రభుత్వ హయాంలోనే మిషన్ కాకతీయ పథకంలో భారీగా దోపిడీ జరిగిందన్నారు. అందుకే ఈ స్థాయిలో చెరువులు తెగాయని ఆరోపించారు. వర్షం, వరద కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10 వేలు ప్రకటించనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ. 5430 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం అంచనా.తెలంగాణ ...మిగతాది 2 లో

# ముళ్లపొదల్లో పసికందు
## తల్లిని గుర్తించిన స్థానికులు

**- జయభేరి, మేడ్చల్:**

పుట్టిన కొద్ది క్షణాల్లోనే పసికందు ముళ్ళపొదలో లభించిన దారుణ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో జరిగింది. స్థానికుల కథన ప్రకారం సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో గౌడవెల్లి గ్రామ పరిధిలో రైల్వేగేట్ ఆవల ఉన్న ముళ్ల పొదల్లో శిశువు ఏడుస్తున్నట్టు అటుగా వచ్చిన ఆటో డ్రైవర్ గుర్తించాడు. లోపలికి వెళ్లి . బొడ్డుకూడ ఊదని ఆడ శిశువు పాలిథిన్ కవర్లో చుట్టి పడివేసినట్టు గుర్తించాడు. వెంటనే పక్కనే హోటల్ను నిర్వహిస్తున్న లక్ష్మి చెప్పాడు. వారు గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చారు. ఆయన అశా కార్యకర్త ఏఎన్ఎంకు తీసుకొని హుటాహుటీనా ఘటనా స్థలికి వెళ్లాడు. అందరూ కలిసి ఆ శిశువును ముళ్ల పొదల్లో నుంచి జాగ్రత్తగా బయటికి తీశారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో శిశువు తల, చెంపకు అంటుకున్న చీమలను తొలగించడంతో ప్రదమ చికిత్స అందించి, మేడ్చల్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులతో పాటు సీడీపీవోకు సమాచారం అందించారు. సీడీపీవో శారద శిశువును ఆరోగ్య కేంద్రానికి తరలించేలోపే అక్కడికి చేరుకున్నారు. వైద్యులు పాపకు తగిన వైద్యం అందించారు. ముళ్ల పొదల్లో పురిటి శిశువును పడవేసిన ఘటనపై ఆరా తీయగా పలువురు స్థానికేతరులు కోళ్లఫారంలో కార్మికులుగా పని చేసే తులసి(17), సంతోష్ (19) గురించి పోలీసులకు సమాచారం అందంచారు. వారిని పిలిపించి గట్టిగా మందలించడంతో తమ శిశువు అని ఒప్పుకున్నారు. నివాసం ఉన్న చోటనే ప్రసవించిన తులసి కొద్ది క్షణాల్లోనే ముళ్ల పాదల్లో పడవేసినట్టు స్థానికులు, పోలీసులు గుర్తించారు.




# శిల్పా షెట్టి పేరు చెప్పి 5.5 కోట్లు

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్3:**

ఆన్‌లైన్‌లో వందలు, వేలు, లక్షలు ఫ్రాడ్ చేయడం కన్నా.. ఒక్క సారే కోట్లు చేస్తే బెటరని ఫ్రాడ్‌స్టర్లు అనుకుంటున్నారు. ఫలితంగా బ్యాంకు అకౌంట్లలో బాగా డబ్బులున్న వారిని లేకపోతే కాస్త సమాజంలో ...మిగతాది 2 లో

# మోడీకి బ్రూనైలో ఘన స్వాగతం



**జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:**

భారత ప్రధాని నరేంద్ర మోదీ బ్రూనై పర్యటనలో ఉన్నారు. బ్రూనై సుల్తాన్ హాజీ హసనల్ బల్కియా ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఇక్కడికి చేరుకున్నారు. బ్రూనై పర్యటన చేసిన మొదటి భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు. క్రౌన్ ప్రిన్స్ అల్‌ముహతాది ప్రధాని మోదీకి ఘనస్వాగతం పలికారు. భారత ప్రధానిగా తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదే కావడం విశేషం. ప్రధాని నరేంద్ర మోదీ నేటి నుంచి మూడు రోజులపాటు బ్రూనై, సింగపూర్‌లో పర్యటించనున్నారు. సెప్టెంబర్ 3, 4 తేదీల్లో ప్రధాని మోదీ బ్రూనైలో పర్యటిస్తారు. భారత ప్రధాని బ్రూనైలో పర్యటించడం ఇదే తొలిసారి. భారత్ - బ్రూనై మధ్య దౌత్య సంబంధాలు 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన కొనసాగుతోంది. బ్రూనై పర్యటన అనంతరం ప్రధాని మోదీ సింగపూర్ వెళ్లనున్నారు. సింగపూర్ ప్రధాని ఆహ్వానం మేరకు ఆయన ఆ దేశాన్ని సందర్శించనున్నారు.

# తెలంగాణ అంతా హైడ్రా లాంటి వ్యవస్థ

2 లో

# 10 నుంచి జనాల్లోకి కేసీఆర్

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 3:**



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రజల్లోకి రానున్నారు. వినాయక చవితి పర్వదినం ముగిసిన తర్వాత ఆయన ప్రజలను నేరుగా కలుసుకునేందుకు.. పర్యటించాలని నిర్ణయించినట్టు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను కేసీఆర్ ఎండగడతారని.. ప్రజలతో కలిసి ఉద్యమానికి రెడీ అవుతారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. తెలంగాణలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా.. ప్రజా సమస్యలపై పోరాడేందుకు కేసీఆర్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రజల నుంచి నిరంతరం.. లేఖలు, ఫోన్లు, సందేశాల రూపంలో కేసీఆర్‌కు అనేక విన్నపాలు వస్తున్నాయని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. వీటిలో ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపైనే ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నట్టు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం మానేసిన.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఈ విషయాన్ని దారి మళ్లించేందుకు.. రాజకీయ నేతల నోరు నొక్కేందుకు హైడ్రా సంస్థను తీసుకువచ్చిందనేది కేసీఆర్ అభిప్రాయంగా చెబుతున్నారు.కొన్ని దశాబ్దాలుగా ఉన్న నిర్మాణాలు.. రేవంత్‌రెడ్డికి ఇప్పుడే గుర్తుకు వచ్చాయా? అనేది కేసీఆర్ ప్రశ్నగా ఉందన్నారు. దీనికితోడు రైతు రుణ మాఫీలోనూ అక్రమాలు చోటు చేసుకున్నట్టు ఫిర్యాదులు అందాయని.. ఇక, ఇతర పథకాల అమలుపై కూడా ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని.. అందుకే వారి తరఫున పోరాటం చేసేందుకు కేసీఆర్.. ఈ నెల 10 తర్వాత.. నేరుగా ప్రజాక్షేత్రంలోకి దిగనున్నట్టు బీఆర్ఎస్ వర్గాలు వివరించాయి. ఈ పర్యటనకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయని తెలిపాయి.ఆరు గ్యారంటీల అమలు, అదుపుతప్పిన పాలనపై 'సమరశంఖం' పేరుతో ఉద్యమాన్ని నిర్వహించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. కాగా, అనారోగ్య కారణాలతో కేసీఆర్.. గత కొన్నాళ్లుగా ఇంటికే పరిమితం అయ్యారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు కూడా.. ఒక్కరోజు మాత్రమే హాజరయ్యారు. ఆ తర్వాత.. మళ్లీ ఇంటికే పరిమితం అయ్యారు. ఇప్పుడు ప్రజల నుంచివస్తున్న అభ్యర్థనల నేపథ్యంలో ఆయన ప్రజాక్షేత్రంలోకి రావాలని నిర్ణయించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

▶▶ మొదటిపేజీ తరువాయి

## కఠిన చర్యలు

ప్రజలకు నష్టం జరిగితే ఊరుకునేది లేదు. రెండు రోజులుగా వరద బాధిత ప్రజలు పడుతున్న బాధలు నేను నేరుగా చూశాను.

బిడ్డను బతికించుకోవడానికి భార్యను భర్త వదిలి రావాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో మనం అర్థం చేసుకోవాలి. వృద్ధులు నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఇంట్లోకి నీళ్లతో పాటు పాములు వచ్చి చేరుతున్నాయి...దీంతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రతి కుటుంబం బాధలో ఉంది..మానవతా దృక్పదంతో పని చేద్దాం. బాధితులు కూడా ఐవీఆర్ఎస్ కాల్ కు సరైన సమాధానం ఇవ్వండి. ఎక్కడ ఆహారం అందలేదో అక్కడికి అధికారులను పంపుతాం. విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి. మూడు రోజులుగా వదర ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నా.... ఇక నుండి ఎవ్వరు పని చేయకపోయినా కఠిన చర్యలు ఉంటాయి. మానవతా దృక్పదంతో పనిచేసే ప్రభుత్వ ప్రతిష్ట పెంచుకుందాం. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సర్వశక్తులు ఒడ్డి కాపాడాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదు. బాధితుల కోసం ఎంతైనా ఖర్చు చేస్తాం. బాధితులంతా సంయమనం పాటించాలి...అరగంట ఆలస్యమైనా అందరికీ న్యాయం చేస్తాం. రాష్ట్రంలోని ప్రజలకు కూడా పిలుపునిస్తున్నా...సమాజంలో బాధ్యత కలిగిన మనం బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ఏ విధంగా సాయం అందిస్తారో మీ ఇష్టం. సాటి మనిషి ఇబ్బందుల్లో ఉన్నప్పుడు భోజనం అందిస్తారా, నిత్యావసర సరకులు అందిస్తారా, పరామర్శించి ధైర్యం చెప్తారా...ఏదైనా మీ శక్తి మేరకకు చేయండి. సమాజం బాగుంటేనే మనం బాగుంటాం. మేము చేయాల్సిన పనులన్నీ చేస్తున్నాం.

**వారిది చెత్త రాజకీయం**

కొందరు చెత్త రాజకీయాలు చేయకుండా ప్రజాహితం కోసం పనిచేయాలి. ఆపద సమయంలో కుట్రలు జరుగుతున్నాయి. అధికారులు బాధ్యటాయితంగా పనిచేయాలి. సహాయకచర్యలకు భంగం కలిగించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవాలని కుట్రలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని సాహించేది లేదు. మీడియా ప్రతినిధులు కూడా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి...తప్పుడు వార్తలు ప్రచారం చేయడం సమంజసం కాదు. పెద్ద ఎత్తున నీటి ట్యాంకులు తెప్పించి పరిసరాలు శుభ్రం చేస్తాం. మరో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేస్తాం. ఐదేళ్లు వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయి...అధికారులు పని చేయడం మానేశారు. ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యం వహించిన కొందరు అధికారులకు షోకాజ్ నోటీసులు కూడా పంపించాం. ఇప్పటికే జక్కంపూడిలో ఓ అధికారిని సస్పెండ్ చేశాం. సరిగా పని చేయకపోతే ఎవరినీ ఉపేక్షించం. మంత్రులు కూడా సరిగ్గా పనిచేయకపోయినా చర్యలు తీసుకుంటాం.

మన కుటుంబ సభ్యులు ఒకరు చనిపోతే మనం ఎలా బాధపడతామో అధికారులు కూడా ప్రజల బాధల పట్ల అదే విధంగా ఆలోచించాలి. ఎన్నో ఘటనలు చూశాను...అందుకే నాకు బాధ కలిగింది. వర్షం పడి ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే గుడ్లవల్లేరు కాలేజీలో సమస్య అంటూ మాట్లాడుతున్నారు. సిగ్గుంటే ఇలా మాట్లాడతారా.? రాజకీయ ముసుగులో నేరస్తులుగా ఉండేవారు మా అటెన్షన్ డైవర్ట్ చేసి ప్రజల్ని ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి కొట్టుకొచ్చిన బోట్లపైనా విచారణ చేస్తాం. బోట్లు తగిలిన చోట్ల పిల్లర్ దెబ్బతింది. ఫుడ్ పాయిజన్ చేస్తున్నారు. బాబాయ్ ని చంపి నారాసుర రక్త చరిత్ర అని నాపై వార్తలు రాసిన వాళ్లపై ఇలాంటి అనుమానులు ఎందుకు రావు.? తప్పులు జరక్కుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది..దుర్మార్గుల నుండి ప్రజల్ని కాపాడుకుని మనం ముందుకెళ్లాలి. ఏస్థాయిలో తప్పు జరిగినా ఉపేక్షించను. నిన్న, మొన్న కొందరు అధికారులు సరిగా పని చేయలేదు. ప్రజలు కట్టే పన్నుల నుండి జీతాలు తీసుకుంటున్నారని గుర్తుంచుకోవాలి. సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చి పరువు పోగొట్టుకోవద్దు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరుతున్నా.

**5 నిమిషాలు షో చేసి వెళ్లారు**

నిన్న ఐదు నిమిషాలు జగన్ వచ్చి షో చేశారు. కనీసం ఒక్కరికైనా ఒక పొట్లం ఆహారమైనా అందించారా.? ఒక్కరినైనా రక్షించారా..కనీసం పలకరించారా.? వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. అంతర్జాతీయ డ్రగ్ మాఫియా డాన్ ఎస్కోబార్ కూడా జగన్ లాగే వ్యవహరించేవారు. వీఆర్ లో పెడితే పని చేయరా... జీతం తీసుకోవడం లేదా.? ప్రజలు ఉంటేనే మనం ఉంటాం. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కొందరు మీనవేషాలు లెక్కిస్తున్నారు. నేను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, బాధితులకు సాయం అందించాలని ఆదేశించినా క్షేత్ర స్థాయిలో కొందరు అధికారులు పని చేయడం లేదని బాధితులు చెప్తున్నారు. హుద్ హుద్ సమయంలో చేసిన సేవలను నాడు ప్రధాని చూసి అభినందించారు. ఈ వరదలతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఇక్కడే ఉండి పని చేస్తున్నాం. మూడు రోజులు బిడ్డకు పాలు అందకపోతే ఏ తల్లిదండ్రులైనా బాధపడతారు.. అందుకే మానవతా దృక్పందంతో పని చేయాలని చెప్తున్నా. రేపటిలోగా సరిగా పని చేయని అధికారులు తీరు మార్చుకోకపోతే ఇక ఆ తర్వాత మీరే చూస్తారు' అని సీఎం హెచ్చరించారు.

## ప్రభుత్వం అప్రమత్తం వల్లే పెద్ద నష్టం తప్పింది

రాష్ట్రానికి సాయం చేయాలని రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీకి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతిపక్షాలపై ఆయన మండిపడ్డారు. కెసిఆర్ కుటుంబం వద్ద లక్ష కోట్ల రూపాయలున్నాయని, ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 2000 కోట్లు ఇవ్వొచ్చు కదా అన్నారు. అమెరికాలో కెటిఆర్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. హరీశ్ రావు ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు భజన చేస్తున్నాడని విమర్శించారు. త్వరలో అందరి లెక్కలు తీస్తానని, ఖమ్మంలో పువ్వాడ అజయ్ ఆక్రమణల గుట్టు తేలుస్తానని, హరీశ్ రావు వస్తే నిజ నిర్ధారణ కమిటీ వేస్తానని సవాల్ విసిరారు. ఈటెల రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం మాని కేంద్ర నుంచి నిధులను తెప్పించి, చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు.

## శిల్పా షెట్టి పేరు చెప్పి

ఉన్నత స్థానంలో ఉన్న కుటుంబాల్లో పెద్ద వారిని టార్గెట్ చేసుకుంటున్నారు. ఫోన్ల ద్వారానే మొత్తం ఊడ్చేస్తున్నారు. ఇలాంటి ఘటన హైదరాబాద్‌లో తాజాగా జరిగింది. ఈ ఘటనలో బాధితురాలు ఏకంగా ఐదు కోట్ల అరవై లక్షల రూపాయలు పోగొట్టుకున్నారు. హైదరాబాద్ అడిక్ మెట్‌లోని విద్యానగర్ ప్రాంతంలో నివసించే వృద్ధురాలైన ఓ మహిళకు కొద్ది రోజుల కిందట వాట్సాప్ కాల్ వచ్చింది. తెలియని నెంబర్ నుంచి వచ్చిన నెంబర్ నుంచి వచ్చిన ఆ కాల్ ను రిసీవ్ చేసుకోవడమే ఆ పాలిట శాపం అయింది. ఫోన్ చేసిన వారు తాము ముంబై పోలీసులమని.. శిల్పా షెట్టి, రాజ్ కుంద్రాలకు సంబంధించిన ఓ కేసులో మీ పేరు బయటకు వచ్చిందని చెప్పారు. ఆధార్ కార్డు నెంబర్ చెప్పడంతో ఆ మహిళ భయపడిపోయింది. ఆమెకు చెందిన బ్యాంక్ అకౌంట్‌లో అనుమానాస్పద లావాదేవీలు జరిగాయని.. సహకరించకపోతే కుటుంబం అంతటిని అరెస్టు చేస్తామని బెదిరించారు. ఫోన్ చేసిన వాళ్లు ఒక్క సారే ఫోన్ చేసి ఈ మోసం చేయడం లేదు. విడతల వారీగా ఆ మహిళ దగ్గర ఎంత నగదు ఉందో.. అంత పిండుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. డిజిటల్ అరెస్టు చేసేశామని.. తమ పోలీసులు రెడీగా ఉంటారని.. కానీ కేసు నుంచి బయట పడటానికి ఓ చాన్స్ ఇస్తామని చెప్పి.. ఆ సొమ్మంతా తిరిగి ఇవ్వాలని బెదిరించారు. ఇలా మొత్తంగా ఆమె వద్ద ఉన్న సొమ్ము.. పీఎఫ్ అమౌంట్ కూడా డ్రా చేసేసి మొత్తం వారికి అప్పచెప్పారు. అలా ఐదు కోట్ల అరవై లక్షల రూపాయలు వారు చెప్పినఖాతాలకు ట్రాన్స్ ఫర్ చేశారు. తమ తల్లి ఇలా లక్షలకు లక్షలు ఏమి చేస్తుందో తెలియక ఓ సారి ఆమె పిల్లలు గట్టిగానే అడిగారు. అప్పుడు కానీ ఆమె అసలు నిజం చెప్పలేదు. అప్పుడు కూడా నిజం చెబితే మిమ్మల్ని కూడా అరెస్టు చేస్తారని వణికిపోయింది. కానీ ఈ ఆన్ లైన్ మోసం గురించి క్లారిటీ ఉండటంతో పోలీసుల్ని ఆశ్రయించారు. ఇప్పుడు ఆ సొమ్ము రికవరీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఆన్ లైన్‌లో వచ్చే ఫెడ్క్స్.. ఈడీ పేరుతో కాల్స్ మొత్తం ఫ్రాడేనని పోలీసులు చెబుతున్నారు. ఇలాంటి కాల్స్ లో మోసపోతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలని సూచిస్తున్నారు. లేకపోతే 8712672222 నెంబర్‌కు.. WWW.Cybercrime.gov.in అయినా ఫిర్యాదు చేయవచ్చు. ఆన్ లైన్ మోసాల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# తెలంగాణ అంతా హైడ్రా లాంటి వ్యవస్థ




జయభేరి, వరంగల్, సెప్టెంబర్ 3:

మహబూబాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి వరదలపై చేసిన సమీక్షలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైడ్రా తరహాలో ప్రతి జిల్లాలోనూ ఒక వ్యవస్థను కలెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించారు. చెరువులను ఆక్రమించుకోవడం క్షమించరాని నేరం అని.. చెరువుల ఆక్రమణలపైన రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు పాల్పడినది ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. చెరువుల ఆక్రమణకు సహకరించిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని అన్నారు.చెరువులు, నాలాల ఆక్రమణల జాబితా సిద్ధం చేయాలి. మాజీ మంత్రి ఆక్రమణ వల్లనే ఖమ్మంలో వరదలు వచ్చాయనే ఫిర్యాదులు వచ్చాయి. అమెరికాలో జల్సాలో మునిగి తేలుతున్న ఆయన.. ప్రభుత్వం పైన విమర్శలు చేస్తున్నడు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా హరీష్ రావు ఖమ్మం పర్యటనకు పోయిండు. ఖమ్మం మాజీ మంత్రి ఆక్రమణలపైన తొలగింపునకు హరీష్ రావు సహకరిస్తారా? 28 సెంటీమీటర్ల వర్షం కురిసినప్పటికీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. అయినా ప్రాణ నష్టం జరగడం బాధాకరం. జిల్లాలో నలుగురు చనిపోయారు. అందులో ఇద్దరు ఈ జిల్లా వాసులు, మరో ఇద్దరు ఖమ్మం జిల్లా వాసులు ఉన్నారు. మహబూబాబాద్ జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 680 మందికి పునరావాసం కల్పించాం. సీతారామ తండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డ ఎస్సై నగేష్ కి అభినందనలు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తాం. ఆకేరు వాగు వరద బారిన పడుతున్న 3 తండాలను ఒకే ప్రాంతానికి తరలించి అదర్శ కాలనీ నిర్మించాలని కలెక్టర్ కు ఆదేశించాం. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ.10 వేల సాయం అందిస్తాం. తెలంగాణలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధానికి లేఖ రాశాం. జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి రాష్ట్రానికి రావాలని ప్రధాన మంత్రిని కోరుతున్నాం. వరదతో చేరిన బురదను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. నష్టం జరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఇతర ప్రాంతాల నుంచి అధికారులను రప్పించుకోవాలి. కూలిపోయిన విద్యుత్ లైన్లను తక్షణమే పునరుద్ధరించాలి. వరద ప్రమాద ప్రాంతాలు, ప్రమాదానికి కారణాలు, వాటిని ఎదుర్కొన్న తీరుపై బ్లూబుక్ ను తయారు చేసుకోవాలి. వాటిని కలెక్టరేట్లలో ఉంచాలి. వరదలు వచ్చినప్పుడు కేసీఆర్ పదేళ్లలో ఎప్పుడైనా పరామర్శకు వచ్చారా..? మాసాయిపేటలో పసిపిల్లలు చనిపోతే కేసీఆర్ పరామర్శించలేదు. హైదరాబాద్ శివారులో పశు వైద్యురాలిని హత్యచేస్తే వెళ్లి చూడలేదు. మానవత్వం లేని మనిషి కేసీఆర్. ప్రతిపక్ష నేత ఎక్కడున్నాడు? ఎందుకు మాట్లాడటం లేదు? స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులకు సాయం కోసం ముందుకు రావాలి'' అని రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు.

### ఎవ్వరిని వదిలిపెట్టం

ఎక్కడికక్కడ వరద సమస్యలు పరిష్కరించేలా.. కలెక్టర్లకు, ఇంచార్జ్ మంత్రులకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వరదలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు దెబ్బతిన్నాయని.. ప్రాణనష్టం తగ్గించగలిగామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులను అభినందిస్తున్నానన్నారు. వరద బాధితులకు సహాయక చర్యలు కొనసాగుతాయని.. 30 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు అంచనా అందిందన్నారు.కాగా.. రాష్ట్రంలో ఆక్రమణలపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాలకు కూడా విస్తరిస్తామన్నారు. అలాంటి వ్యవస్థతోనే కఠిన చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు సూచించారు. ఎవరెన్ని మాట్లాడినా ఆక్రమణలకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందేన్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా హైడ్రా ముందుకు వెళ్తుందన్నారు. చెరువుల కబ్జాలతోనే ఈ ప్రకృతి వైపరీత్యమని.. చెరువులు, కుంటల కబ్జాలపై చర్యలు తప్పవు అంటూ హెచ్చరించారు. నాలాల ఆక్రమణలను ఉపేక్షించేదిలేదని.. కబ్జాలు, ఆక్రమణలు చేసేవారు ఎంతటివారైనా వదిలేదిలేదంటూ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు.

# మహేష్ కుమార్ కే ఛాన్స్



జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 3:

టీపీసీసీ కొత్త చీఫ్ ఎంపిక ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చింది. ఏ క్షణమైనా ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అనేక సమావేశాలు, చర్చల అనంతరం, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ పేరు ఖరారైనట్లు సమాచారం. ఈమధ్యే దీనిపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర నేతలు ఢిల్లీ వెళ్లొచ్చారు. పార్టీ పెద్దలతో చర్చలు జరిపారు. ఆశావహులు ఇప్పటికీ ఢిల్లీలోనే ఉండి మంతనాలు జరుపుతున్నారు.టీపీసీసీ చీఫ్ పదవిని బీసీలకు ఇవ్వాలని హైకమాండ్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మహేష్ కుమార్ గౌడ్, మధుయాష్కీ గౌడ్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇద్దరూ పదవి కోసం పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ఎవరిని ఎంపిక చేయాలనే దానికి పార్టీ నేతలతో అధిష్టానం అనేక చర్చలు జరిపింది. చివరకు మహేష్ కుమార్ గౌడ్‌ను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఈయన గత మూడేళ్లుగా పీసీసీ ఆర్గనైజింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. యువజన కాంగ్రెస్ నుంచి పార్టీలో పని చేస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో పరిచయాలు ఉన్నాయి.తెలంగాణతో పాటు మరో రెండు రాష్ట్రాలకు కొత్త పీసీసీ చీఫ్‌లను కాంగ్రెస్ నియమించనుంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్‌గా ఉన్న దీపా దాస్ మున్షీకి వెస్ట్ బెంగాల్ పీసీసీ పగ్గాలు అప్పగించే ఛాన్స్ ఉంది. తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్‌గా చత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్ వచ్చే అవకాశం ఉంది. ఇక కేసీ వేణుగోపాల్‌కు కేరళ పీసీసీ అధ్యక్ష పదవి దక్కే ఛాన్స్ ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ నియామకాలపై ఏ క్షణమైనా ప్రకటన వెలువడే ఛాన్స్ ఉంది.

**ఉక్కపోతలో సీనియర్లు**

కాంగ్రెస్ పార్టీ అంటేనే గ్రూపులు, కయ్యాలు, అసూయ, అణచివేత.. ఇలా అనేక అంశాలు ఉన్నాయి. దేశానికి ఫ్రీడం సాధించిన పార్టీలో ఉన్న ఫ్రీడంతో నేతలు క్రమశిక్షణ లేకుండా వ్యవహరిస్తారు. అందుకే ఆ పార్టీలో కయ్యాలు నిరంతర ప్రక్రియ. పార్టీలో ఒక లీడర్ ఎదుగుదలను ప్రోత్సహించే వారికన్నా.. ఓర్వలేని నేతలే ఎక్కువగా ఉంటారు. అందుకే ఎదిగే నేతలు.. అనేక ఇబ్బందులు పడుతుంటారు. వాటిని అధిగమించిన వారే పార్టీ అధ్యక్షులుగా, ముఖ్యమంత్రులుగా నిలదొక్కుకుంటారు. లేదంటే రోషయ్యలా తప్పుకుంటారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌కు గుర్తింపు ఉంది. ఇది ఎవరూ కాదనలేదు. కానీ, ఇచ్చిన పార్టీకంటే ఉద్యమ పార్టీకే తెలంగాణ ప్రజలు రెండు ఎన్నికల్లో పట్టం కట్టారు. దీంతో తెలంగాణలో కాంగ్రెస్ పదేళ్లు అధికారానికి దూరమైంది. టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డిని నియమించిన అధిష్టానం అతని సారథ్యంలోనే ఎన్నికలకు వెళ్లి సక్సెస్ అయింది. లోక్‌సభ ఎన్నికల్లోనూ 8 స్థానాలు సాధించింది. టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌కు పగ్గాలు అప్పగించినప్పుడు చాలా మంది సీనియర్లు వ్యతిరేకించారు. అసలైన కాంగ్రెస్ వాదులు పేరిట గ్రూపు కట్టారు. డబ్బులు పెట్టి తెచ్చుకున్నారని ఆరోపించారు. కానీ, వాటిని అధిగమించుకుంటూ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. తర్వాత ముఖ్యమంత్రి కూడా అయ్యారు.టీపీసీసీ ప్రెసిడెంట్‌గా రేవంత్ అయ్యాక వేరు కుంపటి పెట్టిన సీనియర్లు క్రమంగా ఆయనను అణచివేయాలని చూశారు. పదవి నుంచి తప్పించాలని అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేశారు. కానీ, అధిష్టానం ఫిక్స్ అయి ఉండడంతో వారి పప్పులు ఉడకలేదు. మరోవైపు రేవంత్ రెడ్డి తన వ్యతిరేకులను తనకు అనుకూలంగా మలచుకున్నారు. అయితే కొందరు రేవంత్ ను కారణం చూపించి పార్టీని వీడారు. అలాంటి నేతల్లో మొదటి వరుసలో ఉంటారు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. ఎవరు వెళ్లిపోయిన మొండికిపడి పార్టీకి ఊపు తీసుకు వచ్చి విజయతీరాలకు చేర్చిన నేత రేవంత్ రెడ్డి. మళ్లీ కాంగ్రెస్ గెలుస్తుందని తెలిసిన తర్వాతనే బెల్లం చుట్టూ ఈగలు మూగినట్లుగా ఇతర నేతలు వచ్చి చేరారు. అలాంటి వారిలోనూ ఉన్నాడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. పదవి తప్పితే ఆయనకు మరో రాజకీయం తెలియదు. అందు కోసమే కూర్చున్న కొమ్మను కూడా నరుక్కుంటాడు. తెలంగాణలో సీఎంగా రేవంత్‌రెడ్డి బలపడుతున్నారు. అది కాంగ్రెస్ పార్టీకి.. అందులో లీడర్ గా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి నచ్చడం లేదు. తన సామర్థ్యానికి మించిన పదవుల కోసం ఆశలు పడుతూ సొంత పార్టీలో కుంపట్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆయనకు మంత్రి పదవి కావాలంటే.. ఆయన సోదరుడి పదవిని తీసేయాలి. పోనీ ఇద్దరికీ ఇవ్వాలంటే.. పార్టీకి ఆయన విధేయుడు కాదు. కొనఊపిరితో ఉన్న పార్టీ పీక నొక్కడానికి బీజేపీతో కలిసి మునుగోడు ఉపఎన్నిక తెచ్చిన తెచ్చిన ఘనుడు.ఇక రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేస్తున్నారు. పథకాల అమలుతో పాటు.. హైడ్రా వంటి నిర్ణయాలతో ఆయన ప్రజల్లో ప్రత్యేకమైన ఇమేజ్ తెచ్చుకుంటున్నారు. మిగతా వారు ఆయనకు దూరంగా ఉండిపోతున్నారు. రేవంత్ కాకపోతే ఇంకెవరు అన్న ప్రశ్న వస్తే.. రేవంత్ లేకపోతే ఇంకెవరూ ఉండరన్న సమాధానం వస్తోంది. అందుకే లాబీయింగ్ లకు అలవాటుపడిన లీడర్లు.. కొత్తగా పుకార్లు రేపుకుంటున్నారు. ఉక్కపోతకు ఈ పుకార్ల ద్వారా స్వాంతన పొందుతున్నారు.




# 6న పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితా

▶▶ పంచాయతీ సమరం..

జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 3:

అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం మారిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరి సత్తా ఏంటో తేలిపోయింది. తెలంగాణలో ప్రధాన పార్టీలు రెండ్నెల్లలో మరో అగ్నిపరీక్షకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఆలస్యమైన స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ పార్టీలతో భేటీ అయ్యారు ఎస్ఈసీ పార్థసారథి. ఎన్నికల కమిషన్ కార్యాలయంలో గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారీ తుది దశకు చేరుకోవడంతో పార్టీల సలహాలు, సూచనలు, అభ్యంతరాలు, ఫిర్యాదులు ఆహ్వానించారు. వార్డులవారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాను సెప్టెంబరు 6న ప్రకటిస్తారు. 7నుంచి 13వ తేదీదాకా ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 21న తుది ఓటర్ల జాబితాను వార్డుల వారీగా ప్రకటిస్తారు.రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసి ఏడు నెలలు గడిచిపోయింది. ప్రభుత్వం నుంచి రిజర్వేషన్ల వివరాలు అందిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ జారీ కాబోతోంది. అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబరు మొదటి వారంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని పార్టీలు భావిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంకావాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. ముందుగా మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలు ఉంటాయని ఎస్ఈసీ స్పష్టం చేశారు. మొత్తానికి పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాస్త రిలాక్స్ అయిన పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగగానే మళ్లీ ప్రజల్లోకి వెళ్లబోతున్నాయి.తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు మూడు ప్రధానపార్టీలకు ప్రతిష్టాత్మకం కాబోతున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ స్థానిక సంస్థల్లోనూ సత్తా చాటాలనుకుంటోంది. రుణమాఫీ కార్యక్రమంతో పాటు సంక్షేమ పథకాలు, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కలిసొస్తాయన్న ధీమాతో ఉంది అధికారపార్టీ. అధికారంలోకి రాగానే స్థానికసంస్థల్లో పట్టుకోసం ప్రయత్నిస్తున్న కాంగ్రెస్.. వచ్చే ఎన్నికలను ఇజ్జత్‌కా సవాల్‌గా భావిస్తోంది. రేవంత్‌రెడ్డి నాయకత్వానికి రెఫరెండంలా మారబోతున్నాయి స్థానిక సంస్థల ఎన్నికలు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటిన బీఆర్ఎస్ పట్టు నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్‌లో సత్తాచాటిన కారుపార్టీ.. గ్రామీణప్రాంతాల్లోనూ తమ బలం తగ్గలేదని నిరూపించుకోవాలనుకుంటోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిభారాన్ని స్థానిక సంస్థల్లో దించుకోవాలన్న వ్యూహంతో ఉంది బీఆర్ఎస్.అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బలం పుంజుకున్న బీజేపీకి కూడా స్థానికసంస్థలు సవాలుగా మారబోతున్నాయి. క్షేత్రస్థాయిలోనూ బలం ఉందని నిరూపించుకోవాలంటే స్థానిక సంస్థల్లో కూడా సత్తా చాటాల్సి ఉంటుంది. ఒకరికిద్దరు కేంద్రమంత్రులున్నా పార్టీ రాష్ట్ర సారథిపై నాయకత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలుకావటంతో త్వరగా కొత్త అధ్యక్షుడెవరో తేలిస్తే ఎన్నికలకు సిద్ధంకావచ్చంటోంది ఆ పార్టీ కేడర్. మొత్తానికి తొమ్మిదినెలల గ్యాప్ తర్వాత మళ్లీ తెలంగాణలో ఎన్నికల హడావుడి మొదలుకాబోతోంది. గల్లీదాకా పార్టీజెండా ఎగిరే ఎన్నికలు కావటంతో మూడు ప్రధానపార్టీలకూ అత్యంత కీలకం కాబోతున్నాయి

# నియోజకవర్గ అభివృద్ధికి హామీ

▸ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

కాప్రా మునిసిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జోనల్ కమీషనర్ హేమంత్ పాటిల్. కాప్రా మునిసిపల్ కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జోనల్ కమీషనర్ హేమంత్ పాటిల్ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డీసీ జగన్, SC అశోక్ రెడ్డి, EE హరిలాల్, దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, BRS పార్టీ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బద్రుద్దీన్ నవీన్ గౌడ్, కాసం మహిపాల్ రెడ్డి, మహేష్ గౌడ్, ఇంద్రయ్యా బోదాసు నరేష్, గిల్బర్ట్ మహేష్, కొండల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వినాయక చవితి నిమర్జన ఏర్పాట్ల కోసం కాప్రా చెరువులను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కుషాయిగూడ CI అంజయ్య. కాప్రా చెరువులను పరిశీలించి వినాయక నిమర్జననానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకలకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆయన తెలిపారు. చెరువుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, కాప్రా**



## మంత్రివర్గ సహచరులతో కలిసి తన సత్తా చాటుతున్నారు

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 3:**

తెలంగాణ రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (TPCC) కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ ఐజాజ్ UZ జమాన్ వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రంలోని వరద ప్రాంతాలపై సీఎం ఎ. రేవంత్ రెడ్డి, ఆయన మంత్రులు అద్భుతంగా పనిచేస్తున్నారు. M.L.A M.L.C, జిల్లా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, కమిషనర్లు, MRO లతో పాటు ప్రతి జిల్లాకు బాధ్యత వహించాల్సిన సంబంధిత మంత్రులందరికీ నా సలహా, వరద ప్రాంతాలను కేంద్రీకరించాలి, మరణించిన వ్యక్తులు, వారు ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం సహాయం చేయాలి. తెలంగాణ రాష్ట్రం వర్షాలతో అతలాకుతలమైంది. బాధ్యతగల ప్రతిపక్ష నేత ఎక్కడ? ప్రజలకు భరోసా ఇస్తూ ప్రభుత్వానికి సూచనలు చేశారు. అయితే రాజకీయాలు పక్కనపెట్టి ఎవరు సాయం చేయాలనే స్పృహ లేకుండా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. కేసీఆర్ ఏ ఫామ్‌హౌస్‌లో పడుకున్నారో ఆరా తీస్తున్నారు. కవిత బెయిల్ కోసం కేసీఆర్ మొన్నటి వరకు పనిచేశారు. తండ్రి ఫామ్ హౌస్ లో ఉంటే కేటీఆర్ ఇంగ్లండ్ లో రిలాక్స్ అవుతున్నారు. ఇంగ్లాండ్‌లో విహారయాత్రలో ఉన్న ఆయన సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. సామాజిక బాధ్యతను మరిచి సోషల్ ట్వీట్లు పెడుతున్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్నారు. నాలుగు రోజులుగా సీఎం, ఆయన కేబినెట్ మంత్రులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. కేటీఆర్‌కు ట్వీట్ల దాడులు తప్ప మరేమీ లేదు. అర్థంపర్థం లేని ట్వీట్లు చేస్తూ కేటీఆర్‌పై విమర్శలు గుప్పించారు. పంటల బీమా, బాధితులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుండా రైతులను మోసం చేసింది ప్రధాని కేసీఆర్ ఒక్కరే .బీఆర్ఎస్ హయాంలో రాజ్‌భవన్ ఎదుట ఉన్న ఎంఎస్ ముక్త నీళ్లలో మునిగిపోయి కేసీఆర్ బయటకు రాలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా కేంద్రంతో మాట్లాడి ఆర్థిక సాయం చేయాలని కోరారు. కొన్ని వార్తా పత్రికల్లో తమకు నచ్చిన విధంగా వార్తలు రాస్తున్నారు. ఆ వార్తలు ఫేక్ అని వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. పొరుగు రాష్ట్రంలో ఏపీలో ప్రతిపక్షనేతగా జగన్మోహన్ రెడ్డి సమర్థవంతమైన పాత్ర పోషిస్తున్నారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజల పక్షాన నిలిచారు. ఇక్కడ కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఇంతటి విపత్తును కేసీఆర్, కేటీఆర్ ఎందుకు పట్టించుకోవడం లేదు? బీఆర్ఎస్ నేతలు సంపాదించిన సొమ్మును దాచుకునే పనిలో ఉన్నారని, వారిని ఆదుకోవాలి. సిటీ ఆఫ్ లేక్స్ అంటే హైదరాబాద్. అక్రమంగా ఆక్రమించబడిన భూముల కోసం ఇటీవల ఏర్పాటు చేసిన హైడ్రాకు మేము పూర్తిగా మద్దతు ఇస్తున్నాము.

# కాలనీల అభివృద్ధి పనులకు ప్రణాళిక

**జయభేరి, మేడిపల్లి :**



పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ.. పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని కాలనీల సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంనీ దృష్టిలో పెట్టుకుని లో ప్రేషర్, సెవరెజీ ఓవర్ ఫ్లోలు, కలుషిత నీరులాంటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను గుర్తించి మరమ్మత్తులకు, కొత్త అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించి. వీటితో పాటు కార్యాచరణ అమలు చేయడానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని జలమండలి ద్వారా చేపట్టాల్సిన పనుల పురోగతి, తదితర అంశాల గురించి అధికారులతో చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, ఎంపల్లి అనంత్ రెడ్డి, పిట్టల మల్లేష్, బచ్చ రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పప్పుల అంజి రెడ్డి, చంద్రారెడ్డి, బోడిగే కృష్ణ, యసారం మహేష్, కో ఆప్షన్ సభ్యులు చిలముల జగదీశ్వర్ రెడ్డి, ఇర్ఫాన్, జలమండలి సీజీఎమ్ జీఎమ్, డీజీఎమ్, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ కార్డు అప్డేట్ తప్పనిసరి

▸ ఆధార్ కార్డు తీసుకుని 10 ఏళ్ళు దాటితే ఆధార్ కార్డు అప్డేట్ తప్పనిసరి

▸ ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన సెయింట్ మేరీస్ పాఠశాల ప్రిన్సిపల్ బల్లా నక్షత్రం

**జయభేరి, దేవరకొండ :**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, పౌర సేవలు పొందాలంటే ఆధార్ అప్ డేట్ తప్పని సరి అని పట్టణంలోని సెయింట్ మేరీ పాఠశాల ప్రిన్సిపాల్ బల్లా నక్షత్రం అన్నారు. మంగళవారం సెయింట్ మేరీస్ పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్ కార్డులు ప్రస్తుతం కేవలం గుర్తింపు కార్డు లాగానే కాకుండా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు పొందేందుకు ప్రధానంగా ఉందని, కనుక ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదుకు బాధ్యతగా తీసుకొని ఆధార్ ఆధారంగా కొనసాగుతున్న సేవలను భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్డు వివరాలు పునరుద్ధరించుకోవాలని పేర్కొన్నారు.ఉద్యోగాల దరఖాస్తులు, బ్యాంకు ఖాతాలు, ధ్రువపత్రాలు, పొందేందుకు, స్థలాల రిజిస్ట్రేషన్, సిమ్ కార్డులు పొందాలంటే ఆధార్ అప్ డేట్ చేసుకోవాలని సూచించారు. కొంత మంది ఆధార్ కార్డులు తీసుకొని 10 సంవత్సరాలకు పైగా సమయం అయింది. ఫలితంగా కార్డులోని ఫోటోలను అప్‌డేట్ చేసుకొనేందుకు అవకాశం ఉందని అన్నారు.ఆధార్ నమోదు కేంద్రం ద్వారా ఆధార్లో 10 వేలి ముద్రలు, 2 ఐరిస్ ప్రింట్లు మరియు ముఖం యొక్క ఫోటో అప్డేట్ చేసుకోవాలని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు చందర్ నాయక్, నుస్రత్, ఆధార్ నిర్వాహకులు మొహమ్మద్ సిరాజ్, ఇలియాస్ పాల్గొన్నారు.

# ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి త్వరగా ఇచ్చి ఇండ్ల నిర్మాణాలు చేపడతా..

▸ దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్

**జయభేరి, చందంపేట :**



చందంపేట మండల పరిధిలోని నక్కలగండి ప్రాజెక్టు ముంపుకు గురవుతున్న నక్కలగండి తండా, కేశ్య తండా గ్రామాలు గత రెండు రోజులుగా ప్రవహిస్తున్న డిండి వాగు వల్ల నష్టపోయిన పంటలను మరియు ఇండ్లను మంగళవారం దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకొని, నిర్వాసితుల కుటుంబాలను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని హామీ ఇచ్చారు. భూములు సాగు చేస్తూ ప్రస్తుతం ముంపు ద్వారా నష్టం వాటిల్లిన పంటలను వివరాలను వ్యవసాయ అధికారుల ద్వారా పరిశీలన చేయించి నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బద్య నాయక్,మాజీ ఎంపీపీలు పార్వతి చందు నాయక్, గోవింద్,ముత్యాల సర్వయ్య, జడ్పీటీసీ బుజ్జి లచ్చిరామ్ నాయక్,యువజన కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ శ్రీశైలం యాదవ్, డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య, సపావత్ నిరంజన్ (ఎల్ఐసి) కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎంపిడివో కార్యాలయంలో చెక్కుల పంపిణీ

▸ హాజరు కానున్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

**జయభేరి, సెప్టెంబర్ 3:**



ఈ నెల 4 న శామీర్ పేట్ మండల పరిషత్ కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తుంకుంట మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శామీర్ పేట్ మండలం మరియు తుంకుంట మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు అందచేయనున్నట్లు, ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



**జయభేరి, మేడిపల్లి :**

పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని 2వ డివిజన్లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పిర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్,స్థానిక కార్పొరేటర్ సుభాష్ నాయక్, పిర్జాదిగూడ RO శ్రీనివాస్ రెడ్డితో కలిసి పర్యటించి ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అతి భారీ వర్షాల నేపథ్యంలో పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాలనీలలో వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని మున్సిపల్ అధికారులకు మరియు సిబ్బందికి మేయర్ సూచించారు. సానుకూలంగా స్పందించిన మేయర్ అమర్ సింగ్, కార్పొరేటర్, ఇంజనీరింగ్ అధికారులతో సంప్రదింపులు జరిపి పనులు పూర్తిచేసి పీర్జాదిగూడను వరదల నుండి విముక్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ నాయకులు, కాలనీవాసులు, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల స్వైర విహారం

▸ మున్సిపల్ అధికారులు స్పందించాలని విన్నపం



**జయభేరి, సెప్టెంబర్ 3:**

నగరంలో వీధి కుక్కల ఆగడాలు శృతి మించిపోతున్నాయి. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని భవానినగర్ లో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కాలనిలో ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ అటు ప్రజలను వాహనదారులను వెంబడిస్తూ వారిపై దాడులు చేస్తున్నాయి. దీంతో ఈ కాలనిలో నడవాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నారు ఇక్కడి ప్రజలు. ఇక చిన్నారులను బయటకు పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. ఈ సమస్య మరింత తీవ్రతరం అవకముందే మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## నేడు వార్తలాప్ అంశంపై వర్క్ షాప్

**జయభేరి, సెప్టెంబర్ 3:**

మేడ్చల్ మల్కాజ్ గిరి కలేక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 4న పత్రికా విలేఖరుల కోసం వార్తలాప్ అనే అంశంపై మీడియా వర్క్ షాప్ నిర్వహించనున్నారు. భారత ప్రభుత్వం ద్వారా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ వర్క్ షాప్ నిర్వహించనున్నారు. కాగా ఈ కార్యక్రమానికి మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా కలెక్టర్ గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇందులో భాగంగా జర్నలిస్టులకు సైబర్ క్రైమ్, మరియు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నారు.

## అపహరణకు గురైన సెల్ ఫోన్ లను బాధితులకు అందచేత

▸ పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపిన బాధితులు




**జయభేరి, సెప్టెంబర్ 3:**

శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోరికి గురైన మొబైల్ ఫోన్లను బాధితులకు అందచేసారు. ఈ సంవత్సరంలో మొత్తం 19 సెల్ ఫోన్లు అపహరణకు గురైనట్లు తమకు ఫిర్యాదులు అందాయని సీఐ శ్రీనాథ్ తెలిపారు. ఇందులో 11 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు ఆయన వెల్లడించారు. కాగా తమ సెల్ ఫోన్ లను తమకు అందచేయడంతో పోలీస్ సిబ్బందికి బాధితులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# బెజవాడపై కన్నెర్ర చేసిన బుడమేరు



✍ జయభేరి, విజయవాడ, సెప్టెంబర్ 3:

మనిషి ప్రకృతి ముందు ఎంత అల్పుడో మొన్న కేరళలోని వయనాడ్ బీభత్సం తెలియజేస్తే లేటెస్ట్‌గా బెజవాడ వరదలు మరోసారి కన్నెర్రశాయి. ముఖ్యంగా విజయవాడ సిటీ మధ్యలో ప్రవహించే బుడమేరు అనే చిన్న నది నిజానికి నది అని పిలిచినా ఇది ఒక పెద్ద సైజు కాలువ అని చెప్పుకోవచ్చు) ఈరోజు నాలుగు జిల్లాల ప్రజలను బెంబేలెత్తిస్తోంది. విజయవాడ సిటీ అయితే రెండు రోజులుగా నిద్ర పోవడం లేదు. సగానికిపైనే నగరం మొత్తం నీటిలో మునిగిపోయింది. విజయవాడ శివారు గ్రామాలు, ఏరియాలు పూర్తిగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సింగ్‌నగర్, రామకృష్ణాపురం, నందమూరినగర్, నున్న, విజయవాడ వన్‌టౌన్, కృష్ణలంక, ఇబ్రహీంపట్నంలలో ఇళ్లలోకి నీరు చేరిపోయింది. రామవరప్పాడు రైల్వే స్టేషన్ అయితే మొత్తానికి నీట మునిగింది. బుడమేరు వాగు తన విశ్వ రూపాన్ని చూపిస్తోంది. దాని కట్ట తెగిపోవడంతో విజయవాడను ముంచెత్తింది. చాలామంది ప్రజలు మునిగిపోయిన ఇళ్లలోనే ఇంకా చిక్కుకుపోయారు. వారిని కాపాడటానికి కేంద్రం నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, స్పీడ్ బోట్లు, హెలికాప్టర్లు ప్రత్యేకంగా విజయవాడ చేరుకున్నాయి. ఇంతటి విధ్వంసాన్ని సృష్టించిన బుడమేరు కథేంటి. దాని వరదను ఎందుకు అంచనా వేయలేకపోయారు అనే విషయాల్లోకి వెళితే చాలా అంశాలు బయటకు వస్తాయి.బుడమేరు అనేది మైలవరం కొండల్లో పుట్టిన ఒక పెద్ద వాగు. అయితే చరిత్రలో చాలా ఏళ్ళ నుంచి దానిని నదిగానే పరిగణిస్తూ అంటారు. ఏడాది పొడువునా ఏదో ఒక స్థాయిలో దీన్లో నీళ్ళు ఉంటాయి. కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల మధ్య విస్తరించి ఉన్న అతిపెద్ద మంచినీటి సరస్సు కొల్లేరుకు నీటిని సప్లయి చేసే అతి పుట్టిన ప్రాంతం నుంచి దాదాపు 170km దూరం ప్రవహించే బుడమేరులో ఏటా 10 వేల నుంచి 11 వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అయితే 2005 ప్రాంతంలో వచ్చిన వర్షాలకు బుడమేరులో ఏకంగా 75 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించింది అని చెబుతారు. అప్పుడే విజయవాడ చాలా వరకూ దెబ్బతింది. ఆ తరువాత 2009లో మరోసారి అలాంటి పరిస్థితే ఎదురైంది. బుడమేరు వాగు తన ప్రయాణంలో చాలా మలుపులు మెలికలు తిరుగుతూ ఉంటుంది. దానివల్ల ఎక్కువ ప్రవాహం వచ్చినపుడు అది గట్టు దాటి చుట్టూ ఉన్న ప్రాంతాలకు చేరిపోతూ ఉండేది. అందుకే ఈ నదికి బెజవాడ దుఃఖ:దాయని అని పేరు పడింది. 2005లో వచ్చిన భారీ వరదలు చూసిన ఇరిగేషన్ శాఖ బుడమేరు నది పొడవునా ఒక రిటైనింగ్ వాల్ నిర్మించాలనే సూచన చేసింది. దీనిపై అప్పట్లో కొంతమేర వర్క్ జరిగినా తరువాత పూర్తిగా పక్కన పెట్టేశారు. బుడమేరు నుంచి నీరు రెండు భాగాలుగా ఒకటి డైరెక్ట్‌గా కొల్లేరు చేరుకుంటే మరొకటి కృష్ణలో కలుస్తుంది. ఈ కృష్ణలో కలిసే భాగం మధ్యలో పోలవరం నుంచి వచ్చే కాలువతో చేరుతుంది. కొల్లేరుకు వెళ్ళే నది మధ్యలో కృష్ణ నుంచి విజయవాడ సిటీ మధ్యగా ప్రవహించే ఏలూరు కెనాల్‌లో కలుస్తుంది. బుడమేరు ప్రవహించే ప్రాంతంలో ఈ రెండు దశాబ్దాల్లో విపరీతంగా భూ ఆక్రమణలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలు పెరిగాయి. ఈ ప్రాంతాల్లో తక్కువ రేటుకే స్థలం లభిస్తుండడంతో పేద మధ్య తరగతికి చెందిన ప్రజలు కొనుగోలు చేసి ఇళ్ళు కట్టుకున్నారు. ఓటు బ్యాంకు పాలిటిక్స్ వారికి అండగా నిలబడడంతో అధికారులు కూడా మిన్నకుండి పోయారు అనే ఆరోపణలు ఉన్నాయి. దానితో బుడమేరు ప్రవహించే చాలా భాగం ఆక్రమణకు గురైంది. ఇప్పుడు భారీ వర్షాలు కురియడంతో పైనుంచి వచ్చిన వరద నీరు ఆ ఆక్రమణలను ముంచేసింది. దానితో బెజవాడ కనీవినీ ఎరుగని విధ్వంసాన్ని ఎదుర్కొంటుంది. గుంటూరు, అమరావతి విజయవాడను కలిపి ఒక విశ్వనగరంగా ఏపీకి క్రొత్త రాజధానిగా నిర్మించాలని చూస్తున్న ప్రభుత్వ ఆలోచనలకు ఈ వరదలు దాగున్న పెద్ద ప్రమాదాన్ని తెలియజేశాయి. ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో బుడమేరుకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సూచనలతో రిటైనింగ్ వాల్ నిర్మించడంతోపాటు నదీ పరివాహక ప్రాంతంలోని ఆక్రమణలను తొలగిస్తేనే బుడమేరుతో బెజవాడకు ఉన్న ప్రమాదం తొలగుతుంది అని పర్యావరణ వేత్తలు నిపుణులు చెబుతున్నారు .

# వరల్డ్ క్లాస్ ఫెసిలీటీస్ తో వందే భారత్ స్లీపర్స్

✍ జయభేరి, బెంగళూరు, సెప్టెంబర్ 3:

రైలు ప్రయాణంలో నూతన అధ్యాయం ప్రారంభం కానుంది.. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న వందే భారత్ స్లీపర్ రైలు త్వరలోనే పట్టాలెక్కనుంది.. వందే భారత్ స్లీపర్ రైలు అధునాతన సాంకేతికత, సౌకర్యాల మేళవింపుతో రైలు ప్రయాణానికి సరి కొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతుంది. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తుంది భారతదేశంలో మొట్టమొదటిసారిగా, ఈ రైలు జతను ఫంక్షనల్ ఎక్సలెన్స్‌తో సౌందర్య ఆకర్షణను మిళితం చేసేలా సూక్ష్మంగా రూపొందించారు. రైలులో ఉపయోగించిన అన్ని పదార్థాలు, భాగాలు అత్యధిక అగ్నినిరోధక భద్రతా ప్రమాణాలకు కట్టుబడి ఉంటాయి. ప్రపంచ స్థాయి సౌకర్యాలు, ఉన్నతమైన ఇంటీరియర్స్‌తో రూపొందించిన వందే భారత్ స్లీపర్ రైలు భారతదేశం రైలు సామర్థ్యాలలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. ఇది యూరోపియన్ స్థాయి ప్రమాణాలతో సమానంగా ప్రయాణీకులకు అనుభవాన్ని అందిస్తుంది. భారతదేశంలో సుదూర రైలు ప్రయాణాన్ని విప్లవాత్మకంగా మార్చడానికి అనుగుణంగా రూపొందించారు. ఈ విభాగంలో సౌకర్యం, భద్రత, సామర్థ్యం కోసం నూతన ప్రమాణాలను నెలకొల్పారు.. వందే భారత్ స్లీపర్ రైలు ప్రపంచ స్థాయి ఫీచర్లను కలిగి ఉంది.




**ముఖ్యమైన విశిష్టతలు:**

- ఆస్టెనిటిక్ స్టెయిన్లెస్ స్టీల్ రైలు
- ప్రయాణీకుల భద్రత కోసం రైలు జత లో విలువైన ఫీచర్‌లు
- జీఎఫ్ఆర్ పి ప్యానెల్‌లతో కూడిన ఉత్తమతరగతికి చెందిన ఇంటీరియర్స్
- ఏరోడైనమిక్ బాహ్య రూపాలు
- మాడ్యులర్ పాంట్రీ
- ఈ. ఎన్.45545 ప్రకారం అగ్ని భద్రత, ప్రమాదాలను నిరోధించే సదుపాయం..
- దివ్యాంగులకు అనుకూలమైన ప్రత్యేక బెర్త్‌లు టాయిలెట్లు
- ఆటోమేటిక్ బాహ్య ప్రయాణీకుల తలుపులు
- సెన్సార్ ఆధారిత ఇంటర్ కమ్యూనికేషన్ తలుపులు
- ఎండ్ వాల్ వద్ద రిమోట్‌గా పనిచేసే ఫైర్ బారియర్ డోర్లు
- సమర్థతాపరంగా రూపొందించబడిన వాసన లేని టాయిలెట్ వ్యవస్థ
- డ్రైవింగ్ సిబ్బంది కోసం టాయిలెట్

**వేడి నీటి సదుపాయం..**

- ఏ. సి ప్రథమ చైర్ కార్ లో షవర్ తో వేడి నీటి సదుపాయం.
- యూ ఎస్ బి ఛార్జింగ్ సదుపాయంతో ఇంటిగ్రేటెడ్ రీడింగ్ లైట్
- పబ్లిక్ ప్రకటన - దృశ్య సమాచార వ్యవస్థ
- ఆధునిక ప్రయాణీకుల సౌకర్యాలు
- విశాలమైన సామాను గది


**రైలు పనితీరు:**

- సేవ సమయంలో గరిష్ఠ వేగం 160 కి.మీ
- పరీక్ష సమయంలో గరిష్ఠవేగం 180 కి.మీ

**ప్రయాణీకుల సామర్థ్యం:**

- మూడు రకాల బెర్త్ లు ఉండనున్నాయి.. ఏ. సి 3 టైర్ బెర్త్‌లతో పాటు.. ఫస్ట్ క్లాస్ ఏ. సి బెర్త్ ఉండనుంది.. మొత్తం 823 మంది ప్రయాణించేలా 16 బెర్త్ లు ఉండనున్నాయి..భారత్ ఎర్త్ మువర్స్ లిమిటెడ్, బెంగళూరులో జరిగిన ఒక ముఖ్యమైన కార్యక్రమంలో కేంద్ర రైల్వే, సమాచారప్రసార, ఐటీఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర రైల్వే, జలశక్తి శాఖల సహాయ మంత్రి వి సొమ్మన్న వందే భారత్ స్లీపర్ వెర్షన్ రైలును పరిచయం చేశారు.





## నువ్వు రేయిపగలు నిద్రలేక మినుగురువవుతావు

నిన్నుతాకని నిద్ర.. అరణ్యములో తిరుగుతుంది
నిన్నులేపిన రెక్క.. నీలాకాశాన్ని నీపై వంపుకుంటుంది

నువ్వుఎక్కడో దారితప్పి
నిద్రను వెతుకుంటూ నీఅడుగులను తిప్పుతుంటావు

నీకు కనిపించనిదూరములో గడపలన్నీ
నీశబ్దం వినిపించ కుండా తలుపులు బిగిస్తాయి...

నువ్వు రోడ్లవెంట చిత్తుకాగితమై దొర్లుతుంటావు

సందు సందుల్లో నీకాళ్ళు ఎంతవెతికినా
నీకళ్లలోని చిటపటలు ఎక్కడ కన్నీళ్లురల్చవు

నువ్వు రాత్రంతా మెల్లమెల్లగా కరుగుతుంటే
కన్నర్రమని యేచీకటి నిన్ను ప్రశ్నించదు....

నీనిద్రను గాలి కొండలవెనుకకు మోసుకెలుతుంది...

నీకిప్పుడు దారులులేవు
చీకటితో కప్పపడిన మట్టిపొరల్లో వెలుగులులేవు

మనిషినీతాకే మధురానుబూతుల్లో ఒకటైనానిద్ర
నీఅనుభూతిలోకి ఆకర్షణగా ప్రవేశించలేదు...

నువ్వు తిరిగితిరిగి నిన్ను మరిచిపోతావు
నిద్రకుదూరంగా యేఒడ్డునో అలసిపోతావు...


నీకళ్ళు రుదిరా కేతనలవుతాయి
ఋతువులుతాగి వదలిసినట్టు ఆచేతనమౌతాయి

నీదేహము పొడివారిపోతుంది
కొత్తపోకడలు లేని దిశలో పొలమారిపోతుంది

నిన్ను మెత్తనిపానుపుపై దొర్లించిన
నీమెదడు నీలోనినిద్రను బైటకురమ్మనదు...
నువ్వు రేయిపగలు నిద్రలేక మినుగురువవుతావు...



✍ కృష్ణ మారుపాక
(త్రిపుర సుందరి)
90594 74032




# పెన్షనర్ పుట్టినరోజు భవన

- నిర్మాణ నిధికి 10,116 విరాళం

✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణనిధికి విశ్రాంత సభ్యుడు పి. ర్. కిషోర్ రిటైర్డ్ హెడ్మాస్టర్ తన 76వ పుట్టినరోజు సందర్భంగా రూ 10,116 అందజేసినట్లు ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగునూరు లింగయ్య తెలియజేసారు. కిశోర్ ప్రధానోపాధ్యాయులు గతంలో 66 వేలు అందజేశారని , మొత్తం రూ. 76,116 అందజేసినట్లు జిల్లా కార్యదర్శి కంచెర్ల నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్ తెలిపినారు. సంఘం సభ్యులందరూ వారి దాన గుణమునకు కృతజ్ఞతలు తెలియజేసారు. అనంతరం పెన్షనర్స్ అందరు వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ వనం బుచ్చయ్య, కార్యవర్గం సభ్యులు జంపాల యాదగిరి, గుమ్మడవల్లి కోటయ్య, మోటమర్రి పురుషోత్తం, మునిని వీరయ్య, సభ్యులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- ఎమ్మెల్యే బాలు నాయక్



✍ జయభేరి, డిండి :

డిండి మండలం రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచామని, వ్యవసాయాన్ని పండుగల మారుస్తామని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు. డిండి ప్రాజెక్టు నుండి చందంపేట, నేరేడు గొమ్ము, దేవరకొండ మండలలాల్లో ఉన్న కుంటలను నింపడానికి మంగళవారం డిండి మండల పరిధిలోని కామేపల్లి గ్రామం వద్ద కాల్వ ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ

- భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు సరుకుల పంపిణీ
- ప్రతి ఒక్కరు బాధితులకు అండగా నిలబడాలని విజ్ఞప్తి



✍ జయభేరి, మేడిపల్లి :


రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఖమ్మం జిల్లా పూర్తిగా జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ భవన నిర్మాణ సంఘం చైర్మన్ నత్తి మైసయ్య ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలోని మంచి కంట నగర్ లో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సుమారు 50 కుటుంబాలకు నిత్యవసర సరుకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ఖమ్మం జిల్లాలో ప్రజాజీవనం అస్తవ్యస్తమైందని, ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో వరద బాధితులకు సహాయం చేసి ఆదుకొని అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం బోడుప్పల్ అధ్యక్షులు ఎక్కిరాల లక్ష్మీ నరసయ్య, సంఘ ఉపాధ్యక్షులు నిడమనూరు బ్రహ్మయ్య, సంఘ కోశాధికారి బండారు కురుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలింపు



✍ జయభేరి, వైరా :

వైరా నియోజకవర్గంలో వైరా మున్సిపాలిటీ పరిధిలో ముప్పుకో గురైన ప్రాంతాల వారికి ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతుల మీదుగా నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ..... తెలంగాణ రాష్ట్రంలో వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు ముంపున గురైనాయి. దాంట్లో భాగంగానే వైరా నియోజకవర్గంలో మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులు నీట మునిగి ముంపునకు గురైనాయి. వారిని తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఎప్పుడు అందుబాటులో ఉండటం జరిగింది. అదే విధంగా ప్రభుత్వం ఆదేశాల వరకు వారికి నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది తక్షణమే వారికి సహాయ సహకారాలు అందించి వారు నాది కోవడం జరిగింది. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదనూరు సీతారాములు, బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, పాలేటి నరసింహారావు, వైరా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పమ్మి అశోక్, బోళ్ళ గంగారావు, కొప్పురావూరి శబరినాథ్, కౌన్సిలర్ డాక్టర్ దరెల్లి కోటయ్య, శీలం చంద్రశేఖర్ రెడ్డి, దర్జీ చెన్నారావు, వెంపటి రంగారావు, షేక్ అఫ్జల్, వైరా అసోసియేషన్ డాక్టర్స్, లైన్స్ క్లబ్ ఆర్.




# నేనిక్కడ ఉండటానికి కారణం మోసమే..

తాజా చిత్రం విశ్వం. గోపీచంద్ 32గా వస్తోన్న ఈ చిత్రానికి శ్రీను
టాలీవుడ్ యాక్టర్ గోపీచంద్ కాంపౌండ్ నుంచి వస్తోన్న ప్రకారం టీజర్‌ను లాంచ్ చేశారు. తనకు కాబోయేవాడు
వైట్ల దర్శకత్వం వహిస్తున్నాడు. మేకర్స్ ముందుగా ప్రకటించిన మొదలైంది టీజర్. నరేశ్, ప్రగతి, వెన్నెల కిశోర్‌తోపాటు షకలక
ఎలా ఉండాలో హీరోయిన్ కావ్యథాపర్ చెప్పే సంభాషణలతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతుందని విశ్వం టీజర్
శంకర్, అజయ్ ఘోష్ కాంబోలో సాగే కామింగ్ టైమింగ్ సినిమా అప్పుల్లో రెండో స్థానంలో ఉండటానికి కారణం
చెప్పకనే చెబుతోంది. ఫన్, సీరియస్ ఎలిమెంట్స్‌తో సాగుతూ.. ఇండియా కారణం మోసం అంటూ ఫన్నీ మ్యానర్‌లో
మోసం. నేరాల్లో ఐదో స్థానంలో ఉండటానికి కారణం మోసం.. నేనిక్కడుండటానికి కావ్యథాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది.
సాగుతున్న సంభాషణలు శ్రీనువైట్ల మార్క్‌తో ఇంప్రెసివ్‌గా సాగుతున్నాయి. ఈ మూవీలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.
గోపీమోహన్ స్క్రీన్ ప్లే సమకూరుస్తుండగా.. చేతన్ భరద్వాజ్ మ్యూజిక్,






# ట్రెండింగ్‌లో దేవర చుట్టమల్లె సాంగ్..

పాన్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న తెలుగు సినిమాల్లో ఒకటి దేవర. జూనియర్ ఎన్టీఆర్ టైటిల్‌లో రోల్ పోషిస్తున్నాడు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ దేవర రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ఇప్పటికే మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా చుట్టమల్లె మెలోడీ ట్రాక్‌ను విడుదల చేశారని తెలిసిందే. తారక్, జాన్వీకపూర్ కెమిస్ట్రీలో వచ్చే ఈ డ్యుయెట్ సాంగ్ సినిమాకే హైలెట్‌గా ఉండబోతుందని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. ఈ సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఇంప్రెస్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. చుట్టమల్లె పాట విడుదలైన నెలలోపే (29 రోజులు) యూట్యూబ్‌లో 100 మిలియన్లకుపైగా వ్యూస్‌తో నంబర్ 1 స్థానంలో ట్రెండింగ్‌లో నిలుస్తుంది. ఈ సాంగ్ నాలుగు వారాలుగా మోస్ట్ ట్రెండింగ్ జాబితాలో కొనసాగుతుండటం విశేషం. తారక్, జాన్వీకపూర్ కాంబోను మూవీ లవర్స్ ఏ స్థాయిలో ఎంజాయ్ చేస్తున్నారో చెప్పేందుకు ఇది ఒక ఉదాహరణ. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను శిల్పా రావు పాడింది. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటిస్తుండగా.. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



# గొప్ప మనసు చాటుకున్న మహేశ్‌బాబు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీ అతలాకుతలమయ్యాయి. భారీ వర్షాలకు వరద పోటెత్తింది. వరదకు తెలంగాణలోని ఖమ్మంతో పాటు ఏపీలోని విజయవాడ సహా పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరింది. దీంతో జనమంతా ఉన్న ఇండ్లను వదిలి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బయటపడ్డారు. తినేందుకు సరైన తిండి, తాగేందుకు నీరు లేక అల్లాడుతున్నారు. మరో వైపు వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు టాలీవుడ్ నటీనటులు ముందుకువచ్చారు. సూపర్‌స్టార్ మహేశ్ బాబు వరద బాధితులను ఆదుకునేందుకు తనవంతుగా రూ.కోటి విరాళం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. రెండు రాష్ట్రాల సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.50లక్షల చొప్పున విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలు వరద పరిస్థితిని నుంచి త్వరగా కోలుకోవాలని.. కష్ట సమయంలో సమాజానికి తమవంతుగా సహాయపడాలని ట్వీట్ చేశారు.

# త్వరలోనే రజినీకాంత్ జైలర్ 2

కోలీవుడ్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్‌తో తెరకెక్కించిన జైలర్ బాక్సాఫీస్‌ను ఏ స్థాయిలో షేక్ చేసిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ బ్లాక్ బస్టర్‌కు సీక్వెల్ జైలర్ 2 రాబోతుండగా.. ఈ సినిమాకు హుకుం టైటిల్‌ను పరిశీలిస్తున్నారంటూ ఇప్పటికే నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కాగా నెల్సన్ దిలీప్ కుమార్ చేసిన కామెంట్స్ మూవీ లవర్స్, అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాయి. ఇటీవలే ఓ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో నెల్సన్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. అంతా ఫైనల్ అయిపోయింది.. ప్రొడక్షన్ హౌజ్ సన్ పిక్చర్స్ అధికారిక ప్రకటన చేస్తుందని అన్నాడు. నెల్సన్ దిలీప్ కుమార్ తాజా మాటలతో జైలర్ 2 స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని అవుతుంది. ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా నటించారు. మరి సీక్వెల్‌లో వీరంతా కొనసాగుతారా..? లేదా..? అనేది చూడాలి. ప్రస్తుతం రజినీకాంత్ వెట్టైయాన్, కూలీ సినిమాలతో బిజీగా ఉన్నాడు. టీజీ జ్ఞానవేల్ డైరెక్ట్ చేస్తున్న వెట్టైయాన్ అక్టోబర్ 10న విడుదలవుతుంది. లోకేశ్ కనగరాజ్ డైరెక్ట్ చేస్తున్న కూలీ 2025లో గ్రాండ్‌గా విడుదల కానుంది.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com